క్లుప్తంగా

నేడు గ్రామీణ మేళా

కడప కల్చరల్ : నాబార్డు సహకారంతో స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో వారం రోజులుగా జరుగుతున్న నాబార్డు గ్రామీణ ఉత్పత్తుల మేళా ఆదివారం కూడా కొనసాగించనున్నారు. మేళా నిర్వాహకులు, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఓబుళదాస్ ఈ విషయాన్ని తెలిపారు.

ఘనంగా నషాన్



జెండాతో భక్తులు

కడప ఎడ్యుకేషన్/ కడప కల్చరల్ : కడప నగరం రవీంద్రనగర్‌లోని హుజూరా మసీదు పక్కన ఉన్న హజరత్ సయ్యద్ షా గౌస్ సర్మద్ ఖాద్రి నషాన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం పీఠాధిపతి సయ్యద్ షా భక్తి ఆర్ ఖాద్రి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26, 27న గంధం, ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పురాతన చరిత్ర గల ఈ దర్గాలో నిర్వహించనున్న ఉరుసు విజయవంతం చేయాలని కోరారు.

ఘన సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అందరూ సంఘటితంగా ఉంటూ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని నూర్‌బాష దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్ పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఐఎంఏ హాలులో ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరి సురేష్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ బొల్లి ఓబులేశు, జిల్లా కార్యదర్శి పాలెం సంజీవయ్య, సీకే దిన్నె మండల అధ్యక్షులు భాస్కర్, కడప నగర ఉపాధ్యక్షులు మణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ జై భీమ్ దళిత సేన ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు, కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు హెల్పర్‌పై దాడి

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ పాత ఆసుపత్రి ఆవరణలో గత నెల 30న హెల్పర్ డి.ప్రసాద్ తనకు అప్పగించిన ఆర్టీసీ అద్దె బస్సును పార్కింగ్ చేసుకుని వుండగా కె.రవికుమార్, కె.కిషోర్‌కుమార్‌లు మరో ఐదుగురితో కలిసి దాడి చేశారు. ఈ సంఘటనపై శుక్రవారం బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిందితులలో పై ఇద్దరితో పాటు ప్రశాంత్, వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్, ఏఎస్ఐ భాస్కర్ వున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సి.భాస్కర్‌రెడ్డి వెల్లడించారు.

బహుమతుల ప్రదానం

కడప కార్పొరేషన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం ఊటుకూరు వద్దనున్న భగత్ సింగ్ నగర్‌లో పార్టీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జి కె. స్వప్న నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బి. వీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి తులసికి మిక్సీ, రెండో బహుమతి వెంకట సుబ్బమ్మకు గ్యాస్ స్టవ్, మూడో బహుమతి శ్రీలత, అమరేశ్వరిలకు రైస్ కుక్కర్లను అందజేశారు. అనంతరం 30 మందికి చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపును నిర్వహిస్తున్న వసంత్, చిన్న అనే ఇరువురిని శనివారం తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు. అరెస్టయిన వారి నుంచి 20 క్వార్టర్ల మద్యంను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బెల్ట్‌షాపులను నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టాలెక్కిన డెమో రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నంద్యాల-కడప మధ్య తిరుగుతున్న డెమో రైలును శనివారం నుంచి రేణిగుంట వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతిరోజు నంద్యాల నుంచి రేణిగుంట వరకు, రేణిగుంట నుంచి నంద్యాల వరకు రాకపోకలు సాగించనుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శనివారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు జిల్లా ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణయాదవ్, లక్ష్మణ్‌రావు, కల్యాణ్, రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్ : దేశం యావత్తు గర్వించేలా ఈనెల 19వ తేది విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగనుందని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక రాజీవ్ మార్గ్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి సామాజిక న్యాయ మహా శిల్పం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని, అంబేడ్కర్ కలలను నిజం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్నారన్నారు. అంబేడ్కర్ గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకునేలా 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కుటుంబ సమేతంగా ఆనందాల మధ్య పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్, నగర అధ్యక్షుడు డా. సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డా. పవన్ కుమార్‌రెడ్డి, కార్యదర్శి డా. పెంచలయ్య పాల్గొన్నారు.

జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్ల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రూపొందించిన జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్‌ను శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ఐటీ విభాగం కూడా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్లను అతికించి అక్కడి వారితో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, నేతలు సీహెచ్ వినోద్‌కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ ఐటీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ, బుడ్డా' విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని నగర ప్రముఖులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిలు కలిసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎంపీ స్పందిస్తూ.. నగరంలో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ, ఏపీ దళితమిత్ర సంఘం నాయకులు కె.రామాంజనేయులు, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ చేసిన ఎంపీ

కడప కల్చరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం రాజీవ్‌మార్గ్ సమీప ప్రాంత ప్రజలకు అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్యలో శ్రీ రామవిగ్రహ ప్రతిష్ఠ కమిటీ ప్రతినిధి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌మార్గ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీకి అయోధ్య అక్షింతలను అందజేశారు. వాటిని స్వీకరించిన ఎంపీ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు, సమీప ప్రాంతాల భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలకు వాటిని పంపిణీ చేశారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఆర్మీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తదితరులు



అక్షింతలను అందుకుంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

జోరుగా సంక్రాంతి వ్యాపారం



కడప నగరంలోని వైవీస్ట్రీట్‌లో దుకాణం వద్ద కొనుగోలుదారులు



కడప నగరంలోని వైవీస్ట్రీట్‌లో ప్రజల రద్దీ

కడప కల్చరల్ : మార్కెట్లకు సంక్రాంతి కళ వచ్చేసింది. వ్యాపారాలతో బజార్లన్నీ కళకళలాడుతున్నాయి. ప్రధాన మార్కెట్లలో అడుగు తీసి అడుగు వేసేందుకే కష్టమైన పరిస్థితి ఉంది. శుక్రవారం నుంచి కడప నగరంలోని ప్రధాన మార్కెట్ వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్, వన్‌టౌన్ సర్కిల్ నుంచి గోకుల్ సర్కిల్ వరకు మార్కెట్ జనంతో రద్దీగా కనిపించింది.

వైవీస్ట్రీట్‌లో జనం నడవడానికే ఇబ్బంది కలిగేంతగా కిక్కిరిశారు. కొనుగోలుదారులు ఒక్కసారిగా పెరగడంతో వ్యాపారుల్లో హుషారు కనిపించింది. బజారు, చుట్టుపక్కల వీధులు, ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్యను పోలీసులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కొనుగోలు దారులు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త వహించారు. వ్యాపారాల్లో ప్రధానంగా వస్త్రాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. మొన్నటివరకు వ్యాపారాలు లేవని నిట్టూర్చిన దుకాణదారుల్లో సంతోషం వ్యక్తమైంది. ముఖ్యంగా రెడీమేడ్ వస్త్ర దుకాణాల్లో కొనుగోలు సందడి కనిపించింది. కొన్ని ప్రముఖ దుకాణాలు, బ్రాడెండ్ దుకాణాల్లో పెద్ద ఎత్తున ప్రజలు కొనుగోలు చేశారు.

- ఒకరోజు ముందే పూలు, పండ్లు, నిత్యావసర వస్తువుల దుకాణాలు కూడా రద్దీగా మారాయి. రోడ్డు వారన రెడీమేడ్ వస్త్రాలు, చెప్పులు, ఫ్యాన్సీ సామాగ్రి అమ్మే దుకాణాల వద్ద జనం పెద్ద సంఖ్యలో కనిపించారు. కొబ్బరికాయల దుకాణాలు కొద్దిసంఖ్యలోనే ఉండడంతో జనం వాటిని కొనేందుకు పోటీలుపడ్డారు. పండ్ల మార్కెట్, స్వీట్ దుకాణాలు కూడా రద్దీగా కనిపించాయి. సాయంత్రం వేళల్లో బజార్లు జనంతో కిటకిటలాడాయి.

సంప్రదాయాల సందడి

నగర వీధుల్లో సంక్రాంతి పండుగ సందడి కనిపించింది. ఎప్పటిలా భారీగా ముగ్గుల పోటీలు నిర్వహించకపోయినా దాదాపు ప్రతి వీధిలో స్థానిక దాతలు ముందుకు వచ్చి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ వారంలో ఇప్పటికే కడప నగరంలో 20కి పైగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు వీధుల్లో తెల్లవారకముందే గంగిరెద్దుల వారి మేళాలు పండుగకు ఆహ్వానం పలుకుతున్నట్లు వినిపిస్తున్నాయి. వీధి కూడళ్లలో వారు గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తున్నారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేయడంతో బిజీగా కనిపించారు.

ఫైనాన్స్ సంస్థ ఉద్యోగినిపై ఫిర్యాదుల వెల్లువ

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగినిగా పనిచేస్తున్న సౌజన్యపై రోజురోజుకు ఫిర్యాదులలలు ఎక్కువగా పోలీసులకు అందుతున్నాయి. ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసేవారు, వ్యక్తిగత రుణాలను తీసుకుని చెల్లించేవారు బాధితులుగా మారారు. తాము చెల్లించిన మొత్తానికి రసీదులు ఇవ్వమంటే సర్వర్ పనిచేయడం లేదని, తరువాత ఇస్తామనీ, అవసరమైతే సీసీ కెమెరాలు వున్నాయి కదా అనీ ఉద్యోగిని కస్టమర్లకు నచ్చచెప్పేది. ఈక్రమంలో ఆమెపై వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

ఉద్యోగాలు ఇవ్వడం హర్షణీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీఎస్ ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. రోడ్డుప్రమాదాలతోపాటు క్రమశిక్షణా చర్యల కింద రాష్ట్రంలో 650 మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి వారికి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించారని, దీంతో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి అండగా ఉండడంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

నేటి నుంచి ఉరుసు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షావలి దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సలాఉద్దీన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ హజరత్ సయ్యద్ షావలి దర్గా అతి పురాతనమైనదన్నారు. ఈనెల 14వ తేదీ ఆదివారం రాత్రి గంధం పూల చాందినీలో ఫకీర్ల మేళ తాళాలతో గ్రామంలో ఊరేగింపు జరిగిన అనంతరం దర్గా చేరునన్నారు. 15వ తేదీన రాత్రి ఉరుసు కార్యక్రమ జరుగునన్నారు. ఉరుసు రోజు దర్గా ఆవరణలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్బాస్ సాబిరి, మైసూర్‌కు చెందిన తైహసీన్ లమధ్య గొప్ప ఖవాలీ పోటీ ఉంటుందని వివరించారు. 16వ తేదీన ఉదయం తహలీల్ ఫాతెహా జరుగునన్నారు.

పరిహారం చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కమలాపురం మండలంలో 2018లో నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులకు సంబంధిత డీలర్ వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఏపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. 2018 సంవత్సరంలో కమలాపురం మండలం పెద్ద చెప్పలి, బుడ్డాయి పల్లె, నాటుపల్లె తదితర గ్రామాల్లో వరి సాగు చేశారన్నారు. పెద్ద చెప్పలిలోని నాగభూషణం, నాగార్జున షాపుల్లో కొనుగోలు చేసిన వరి విత్తనాలు నకిలీవి కావడంతో అవి వెన్ను రాక దిగుబడి తగ్గిపోయిందన్నారు. రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంబంధిత రైతులు హరి కుమార్, జగన్మోహన్ రెడ్డి , ఆంజనేయులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

శిల్పారామంలో ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా కడప శిల్పారామంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీకి జిల్లా వ్యాప్తంగా 52 మంది పోటీలో పాల్గొని తమ కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. రంగుల కలయికతో చుక్కల ముగ్గులు, సంప్రదాయ ముగ్గులు ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి టి.శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రస్ సర్కిల్ స్టోర్స్ అసిస్టెంట్ మేనేజర్ మనోజ్‌బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కల్పన మొదటి, సుమలత రెండవ, అరుణకుమారి మూడవ బహుమతి సాధించగా, కె.సుప్రజ, సునీతలకు కన్సోలేషన్ బహుమతులు దక్కాయి.

వేడుకగా సత్యదేవుని కల్యాణం

కడప కల్చరల్ : ధనుర్మాసం 30వ రోజును పురస్కరించుకుని శనివారం కడప నగరం గడ్డిబజారులోని శ్రీలక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లతోపాటు గోదాదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించారు. అనంతరం కల్యాణ పీటలపై కొలువుదీర్చి వివాహ క్రతువును నిర్వహించారు. భక్తుల జేజేల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్త బృందాలు ఈ సందర్భంగా కోలాటాలు, భజన గీతాలతో సందడి చేశారు.



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

పల్లెలే పట్టణాలకు మూలాలు

కడప కల్చరల్ : పల్లెలే నేటి పట్టణాలకు మూలాలని పలువురు వక్తలు అన్నారు. సంక్రాంతి సంబరాలు-2024ను పురస్కరించుకుని కడప రెడ్డి సేవా సమితి నెలరోజులుగా నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడలు, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాల పోటీల ముగింపు వేడుకలను శనివారం కడప నగరం రాజీవ్‌మార్గ్‌లోగల శివశివాని హైస్కూలులో నిర్వహించారు.

రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి సభకు నేతృత్వం వహించారు. కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురియానందసరస్వతి మాట్లాడుతూ రైతు, గ్రామాల విలువ గురించి వివరించారు. సంస్థ మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.శివారెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఎం.రమణి మాట్లాడారు. ఈ సందర్భంగా చాపాడు మండలానికి చెందిన అభ్యుదయ రైతు కుళాయిరెడ్డి చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వైవీయూ క్రీడల విభాగ అధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ పాఠశాల ఆవరణలో భారీగా భోగి మంటలను వేశారు.



భోగి మంటలతో సంక్రాంతికి ఆహ్వానం పలుకుతున్న నగర వాసులు

దుస్తులు పంపిణీ

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంస్థ దత్తత తీసుకున్న కాలభైరవపురంలోని పేదలకు సంక్రాంతి సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ గిరిధర్, స్థానికులు ఆదిలక్ష్మిల సహకారంతో గ్రామంలోని బడి ఈడు పిల్లలతోపాటు మహిళలకు చీరలు ఇచ్చారు.

రాజంపేట రూరల్ : ఎన్ఆర్ఐ కేకేరెడ్డి సహకారంతో శనివారం పెద్దకారంపల్లిలో మన్నూరు రామలక్షుమ్మ, నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 1000 కుటుంబాల వారికి దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, కడప జిల్లా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ మాన' చిన్నప్పరెడ్డి కేకేరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇతర దేశాలలో జీవనం సాగిస్తున్న కేకే రెడ్డి ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం సంక్రాంతికి తన సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేకేరెడ్డి మాతృమూర్తి రామలక్షుమ్మ, ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి, రాజంపేట మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, ఎంపీటీసీ ఏ వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాల పై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాల నుండి పండుగకు ఇంటికి వచ్చే వారి నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు.

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్ : డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పర్సనల్ సెక్రటరీ గౌస్‌పీర్ మైనార్టీ సంక్షేమశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. శనివారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష చేతుల మీదుగా రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, సీఈడీఎం రాష్ట్ర డైరెక్టర్ మస్తాన్‌వలిలు గౌస్‌పీర్‌ను ఘనంగా సత్కరించారు.

మట్కా నిర్వాహకులు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని పాత బైపాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి తెలియజేశారు. కడపకు చెందిన పోలియనూరు సందీప్‌కుమార్, ఊటుకూరు సుబ్బరాయుడు మట్కా రాస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో వారిని అరెస్ట్ చేసి రూ. 60,520 నగదును, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.